

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్.ఇ. బి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ భవన్‌లో జిల్లాలోని ఎఇ, డిఇ, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ ప్రతి డివిజన్లో సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ చేయాలని, సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ అవసరమైన సామాగ్రి ఇప్పటికే అందజేశామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్తు సమస్యలు అనేకం పరిష్కరించామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 30 రోజుల లోపల మంజూరు చేయాలని అలా చేయని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు పగటిపూట ఉచితంగా తొమ్మిది గంటల విద్యుత్తు సరఫరా చేస్తున్నామన్నారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎనర్జీ ఆడిట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బెనర్జీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఇ వెంకటసుబ్బయ్య

సెప్టెంబర్ 15-17 తేదీల్లో

బిల్డింగ్ కనస్ట్రక్షన్స్ అండ్ అదర్ వర్కర్స్ యూనియన్

జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు

నెల్లూరులో నిర్వహణ - 37 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-నెల్లూరు

సెప్టెంబర్ 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్ ప్రాంగణంలో ఆల్ ఇండియా వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాలకు దేశంలోని బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ అండ్ అదర్ వర్కర్స్ యూనియన్ కార్మికులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇప్పటికే దేశ దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీలు ఏర్పడ్డాయన్నారు.దేశం మొత్తం మీద ఉన్న భవన నిర్మాణ రంగానికి సంబంధించిన పలు విభాగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిర్వహించాల్సిన పోరా టాలకు సంబంధించిన ఓ ప్రణాళికను ఈ సమావేశాల్లో రూపొం దించుకుంటా మన్నారు. ఆ ప్రణాళికను అను సరించి రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కార్మికుల సమస్య పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు కె.అజయ్ కుమార్, గజ్జ నాగేశ్వర రావు, ఎస్.ఆర్ బిల్డర్స్ అండ్ ఇంజనీరింగ్ అధినేత సుధాకర్, అల్లాడి గోపాల్, చాంద్ బాషా, రెహానా బేగం, కిన్నెర కుమార్, కాయం శ్రీనివాసులు ,కొండా ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

37 మందితో ఆహ్వాన కమిటీ

సెప్టెంబర్ 15 నుంచి 17 వ తేదీ వరకు నగరంలో జరగనున్న ఆల్ ఇండియా వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణ కమిటీ సమావేశాల జయప్రదానికి ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. మొత్తం 37 మంది సభ్యులతో ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు.

రైతులు, వ్యాపారులతో లోకేష్ భేటీ

ప్రభుత్వం మోసంతో తీవ్రంగా నష్టపోయారు.. అధికారంలోకి వస్తే ఆదుకుంటాం-నారా లోకేష్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోవూరు నియోజకవర్గంలో అనేక మంది ప్రజలు, వ్యాపారం, రైతులు, కూలీలు, చిరువ్యాపారులను కలిశారు. వారి ఇబ్బందులు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. కోవూరుకు చెందిన రైతులు యువనేత నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. తాము సాగునీటి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సాగునీటి నీటి సమస్యకు పరిష్కారానికి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఎన్ని అర్జీలు పెట్టినా లాభం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల పనులపై రూ.68,294 కోట్లు ఖర్చుచేస్తే, జగన్ వచ్చాక అందులో నాలుగోవంతు ఖర్చుచేయలేదన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే లిఫ్ట్

లోకేష్‌ను సత్కరిస్తున్న వ్యాపారులు

ఇరిగేషన్ ఏర్పాటుచేసి కోవూరు ప్రజల సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. .కోవూరు నియోజకవర్గం మండలాయలు గ్రామంలో మీ-సేవ సిబ్బంది యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత 19 సంవత్సరాలుగా 139రకాల సేవలను మీ-సేవ కేంద్రాలద్వారా ప్రజలకు అందిస్తున్నామని, ప్రస్తుతం మాకు రూ.8వేలు మాత్రమే వేతనంగా ఇస్తున్నారని, ఉద్యోగ భద్రత లేదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2020 మార్చి నుంచి రామ్ ఇన్ఫోటెక్ వారు మాకు ఇవ్వాల్సిన జీతాలు, పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ వ్యవస్థ రాకతో మీ-సేవలు కూడా నిర్వీర్యమయ్యాయన్నారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఈ వ్యవస్థను జగన్ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేశారని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మీ-సేవ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. మీ-సేవ ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు అందజేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తా న్నారు. కోవూరు నియోజకవర్గం గుమ్మళ్లదిబ్బ ఎస్సీ కాలనీలో యానాది సామాజికవర్గీయులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కోవూరులో వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోవూరు నియోజకవర్గంలో భారీ జన సందోహం మధ్య పాదయాత్ర సాగింది.

నేను చెప్పింది చేసి చూపిస్తా..!

- ప్లీజ్.. జగన్‌తో నన్ను పోల్చకండి..
- జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి
- మీడియాతో నారా లోకేష్ చిట్‌చాట్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

" నేను పాదయాత్రలో చెబుతోన్న ప్రతి అంశాన్నీ అధికారంలోకి వచ్చిన తరువాత చేసి చూపిస్తా.. మూడేళ్లలో అన్ని వాగ్దానాలు అమలు చేస్తాను.. దయచేసి జగన్‌తో నన్ను పోల్చకండి" అంటూ మీడియా మిత్రులతో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. బుధవారం పాదయాత్రలో భాగంగా నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలోని సాలుచింతల క్యాంప్ వద్ద ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. సుమారు గంట సేపు జర్నలిస్టుల సమస్యలు విన్నారు. అనేక హామీ లిచ్చారు. రాష్ట్రానికి చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. జగన్ చేసే హిస్టారిక్ తప్పులతో ప్రజలపై భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ."ఈ ప్రభుత్వం చేతిలో మీడియా వారూ బాధితులే. నాకు చీటింగ్ చేయడం తెలీదు..అక్రమాస్తుల కేసులు లేవు. టీడీపీ ప్రభుత్వంలో మీరు చేసిన పోరాటం ఇప్పుడు చేయడం లేదు." అన్నారు. ఇళ్ల స్థలాల కోసం గతంలో కమిటీ వేశాం..కుదరలేదు..ఈసారి ఇస్తాం. జర్నలిజం కష్టమైన వత్తి. తమిళనాడులో మీడియా వారికి పెన్షన్ అంశం నా దష్టిలో ఉంది. సోషల్ మీడియా కూడా పవర్ ఫుల్ గా మారింది. పార్టీలో చర్చించి జర్నలిస్టులకు ఏం చేయగలమో అది చేసి చూపిస్తాను. రాష్ట్రం నెంబర్1గా ఉండాలన్నది చంద్రబాబు లక్ష్యం. అందులో మీడియా భాగస్వామ్యం కావాలి. టీడీపీ అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులకు వేధింపులు లేకుండా చేసే బాధ్యత నాది. న్యాయవాదులు కూడా రక్షణ చట్టం అడుగుతున్నారు. జగన్‌లా నేను భయపడను. అన్నింటికీ సమాధానం చెబుతా అని అన్నారు. ఇచ్చిన హామీలు తప్పకుండా టీడీపీ నిలబెట్టుకుందన్నారు.20 లక్షల ఉద్యోగాలు సంక్షేమం కాదు..అదొక ఎకానమీ యాక్టివిటీ. కేజీ టు పీజీ కరికులమ్ మార్చేస్తామన్నారు. నెల్లూరు, కడప జిల్లాల్లో 10కి 10 సీట్లు వైసీపీకి ఇచ్చారని, ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో టీడీపీకి మంచి ఆదరణ ఉందన్నారు.నిన్న 8కి.మీ 7 గంటలకు పైగా పట్టిందన్నారు.మహిళలు పెద్దఎత్తున బయటకు వచ్చి సమస్యలు చెప్పుకుంటు న్నారన్నారు.రాష్ట్రం ఎటుపోతుందోనన్న ప్రజల్లో ఆందోళన ఉందన్నారు. నెల్లూరు, కడప జిల్లాల్లో మెజారిటీ సీట్లు సాధిస్తామ న్నారు. జర్నలిస్టులకు సంక్షేమ నిధి, రిటైర్డ్ మెంట్ తర్వాత బెనిఫిట్స్, ప్రత్యేక చట్టం గురించి పార్టీ పెద్దలతో మాట్లాడి నిర్ణయం ప్రకటిస్తామన్నారు. యూట్యూబ్ ఛానల్స్‌కు ట్రాక్షన్ ను బట్టి అక్రిడేషన్ అందిస్తామన్నారు. అభివద్ధిపై చర్చకు నేను రెడీ..ఏం అభివద్ధి చేశారో చెప్పాలి. మాజీమంత్రి అనిల్ అవినీతికి సంబంధించిన డాక్యుమెంట్లు బయటపెట్టారు.

మీడియా మిత్రులతో నారా లోకేష్

పటిష్టంగా ఓట్ల నమోదు ప్రక్రియ : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను విధిగా పాటిస్తూ ఓటరు సవరణ, నమోదు కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిం చాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్, ఇఆర్ఒలను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ఇఆర్ఒలతో సమావేశమై జిల్లాలో జరగనున్న ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమం అమలు పై సమీక్షించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను విధిగా పాటిస్తూ ప్రత్యేక ఓటర్ సవరణ, నమోదు కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేలా కషి చేయాలని ఇఆర్ఒలను ఆదేశించారు. జిల్లాలో నిర్వహిం చనున్న ప్రత్యేక ఓటరు సవరణ, నమోదు కార్యక్ర మంలో భాగంగా అక్టోబర్ 17న ముసా యిదా ఓటర్ల జాబితాను ప్రచురించాల్సి ఉందని, అందుక నుగుణంగా ఈ నెల 20వ తేదీ నాటికి జిల్లాలోని అన్నీ నియోజక వర్గాల పరిధిలో బి.ఎల్.ఓ లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్ర మాలను పూర్తి చేయాలని ఇఆర్‌ఒలను ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఆగష్టు 21వ తేదీ వరకు నెల రోజుల పాటు బిఎల్‌ఓ లు పోలింగ్ కేంద్రం పరిధిలోని ఇంటింటికి వెళ్లి ఓటర్ల సవరణ, నమోదు కార్యక్రమం నూటికి నూరు శాతం నిర్వహించేలా ఇఆర్‌ఒలు ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా రెవిన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డిఓ లు మలోల, శీనా నాయక్, కరుణకుమారి, జడ్పి సిఈఓ చిరంజీవి, డ్వామా పిడి వెంకట్రావు, వెంకటాచలం తహశీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

తైక్వాండో పోటీలకు క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : ఈనెల 1, 2, 3 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగిన 40వ జూనియర్ బాల బాలికల రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని తైక్వాంటో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ట్రెజరర్ జిల్లా కార్యదర్శి అయిన ఎస్.కె అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ క్రీడల్లో బాలికల విభాగంలో వై.భవ్యశ్రీ, ఐ.శ్రావ్య బంగారు పతకాలు సాధించారు. జి. వరుణ్ చౌదరి, ఐ. శతి రజత పథకాలు సాధించారు. బంగారు పథకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 7,8,9 తేదీల్లో కర్ణాటకలోని షిమోగాలో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటారు. పథకాలు సాధించిన క్రీడాకారులను కోచ్ ముఖేష్ కుమార్, అఖిల్, ప్రశాంత్ బాబులను జిల్లా అధ్యక్షులు ఉన్నం వీరస్వామి , కార్యదర్శి అబ్దుల్ సలాం అభినందించారు.ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్ బాల భాస్క రరావు, కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర, రామారావు, ఉపాధ్యా యులు క్రీడా కారులను అభినందించారు.

'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు : 34 (ఎ) బెటాలియన్‌లో ఉన్న ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్ లోని 185 (ఎ) ఎన్‌సిసి క్యాడెట్స్ 2023 ఫిబ్రవరిలో ఎన్‌సిసి నిర్వహించిన బి, సి సర్టిఫికెట్స్ పరిక్షలలో ఉత్తీర్ణత సాధించిన ఎన్‌సిసి క్యాడెట్లకు బుధవారం ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె విజయ్ శ్రీనివాస్, ఆర్మీ ఆఫీసర్ సుభేదర్ లగ్బీర్ సింగ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. 2023 ఫిబ్రవరిలో ఎన్‌సిసి నిర్వహించిన బి , సి సర్టిఫికెట్స్ పరిక్షలో 100 శాతం ఉఉత్తీర్ణతతో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్స్ ఉత్తమ ప్రదర్శన కనబరిచి 34 (ఎ) బెటాలియన్ ఎన్‌సిసిలోనే ప్రకాశం విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారని ఎన్‌సిసి ఆర్మీ ఆఫీసర్ సుబెధర్ లగ్బీర్ సింగ్ తెలిపారు. ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజి ఎన్‌సిసి నిర్వాహకులు మీరావళి, ఎన్‌సిసి ఆఫీసర్ షేక్ . హిమాంష, సంతోష్ కుమారు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి - కందుకూరు : పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో అమాన ఆంధ్ర ముస్లిమ్స్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా వారి స్పాన్సర్ చేసిన విద్యార్థుల సదస్సును ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎన్ఆర్ఐ షేక్.హుమ విద్యార్థులతో వారి చదువుల గురించి మాట్లాడారు.10వ తరగతి తర్వాత ఏ గ్రూప్ తీస్కుంటే భవిష్యత్తు ఉంటుందనేదానిపై అవగాహన కల్పించారు. పిల్లల చదువుకై ఏమైనా ఇబ్బందులు ఉంటే సహాయం అందిస్తామని ఫౌండేషన్ వారికి హామీ ఇచ్చింది. 10వ తరగతి పిల్లలకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ వారిని హైస్కూల్ వారిని అభినందించారు. హెచ్‌ఎం ద్వారక రాణీ, టీచర్ పార్వతి, స్కూల్ సిబ్బంది, ఫౌండేషన్ ప్రెసిడెంట్ సాజిద్, సెక్రెటరీ ఫౌండర్ షంషేర్, ట్రెజరర్ హాఫీజ్, ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, అన్సర్, శంషుద్ధీన్ పాల్గొన్నారు.

కాలువలో మట్టిని తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి- ఉలవపాడు : ఉలవపాడు పంచాయతీలోని వరిగ చేనుసంఘం వద్ద డ్రెయినేజీ కాలువకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించాలని నిలిచిపోయిన మురుగు నీటిని బైపాస్ ప్రక్కన ఉండే డ్రైనేజీ కాల్వ ద్వారా గతంలో మాదిరిగా చిన్న కాలువకు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం ఉలవపాడు మండల కార్యదర్శి జివిబి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఉలవపాడు పంచాయతీలోని వరిగచేను సంఘం వద్ద డ్రెయినేజీ కాలువకు అడ్డంగా ఓ ప్రయివేటు వ్యక్తి వేసిన మట్టి కారణంగా నిలిచి పోయిన డ్రెయినజీ మురుగునీటిని, కాలువను సిపిఎం ఉలవపాడు మండల కమిటీ ప్రతినిధి బందం పరిశీలించింది. స్థానిక గిరిజనులతో సిపిఎం నాయకులు మాట్లాడారు. పంచాయతీ అధికారులు జోక్యం చేసుకుని డ్రైనేజీ కాల్వ కు అడ్డంగా వేసిన మట్టిని తొలగించాలని, ఆ ప్రయివేటు వ్యక్తి పై తగిన చర్యలు తీసుకోవాలని, డిమాండ్ చేశారు. సిపిఎం ఉలవపాడు మండల కమిటీ నాయకులు ఎస్. డి.గౌస్ భాషా, ఏలూరి. నాగార్జున, కోమరగిరి. శేషమ్మ తోపాటు కెవిపిఎస్ నాయకులు ఎస్. మాచర్ల రావు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రజాశక్తి విలేకరి మృతి

పలువురు సంతాపం

ప్రజాశక్తి-నెల్లూరు

అల్లూరు ప్రజాశక్తి విలేకరి రాజశేఖర్ (42) గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. సాయంత్ర 6.30గంటలకు గుండెలో మంటగా ఉందని చెప్పాడు. వెంటనే అతని స్నేహితుడితో ప్రభుత్వాస్పత్రికి బైక్‌పై వెళ్లారు. అక్కడికి వెళ్లిన వెంటనే వాంతి చేసుకున్నాడు. డాక్టర్ చికిత్స ప్రారంభించగానే మృతి చెందాడు.రాజశేఖర్ ప్రజాశక్తిలో రెండున్నరేళ్ల నుంచి రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. నేడు మధ్యాహ్నం 3గంటలలోపు అల్లూరులోని ఆయన స్వగృహం నుంచి అంతిమయాత్ర సాగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. మంచి మనసున్న మిత్రుడు, ప్రతి ఒక్కరినీ నవ్వుతూ ఆప్యాయంగా పలకరించే వాడు. ఆయన మృతి ప్రజాశక్తికి తీరనిలోటు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సిజిఎం అచ్యుత్‌రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ప్రజాశక్తి బాధ్యులు మాదాల వెంకటేశ్వర్లు, జిల్లా బాధ్యులు ఓ.శ్రీనివాస్, మేనేజర్ కె.కోటేశ్వరరావు, డెస్క్ ఇన్‌ఛార్జి యు.వి.రమణయ్య, స్టాఫర్ పి.బాలకృష్ణ, సిబ్బంది ప్రగాడ సానుభూతి తెలియజేశారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

రాజశేఖర్ (ఫైల్)

వ్యవసాయ సంక్షోభం- ప్రభుత్వ విధానాలపై నేడు సదస్సు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : వ్యవసాయ రంగంలో సంక్షోభం - ప్రభుత్వ విధానాలపై నేడు నెల్లూరు నగరంలో సదస్సు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక టౌన్‌హాల్లో జరిగే ఈ సదస్సుకు ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్,ముఖ్య అతిధిలో పాల్గొననున్నారు. ఏపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయంకార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య ఓ ప్రకటనలో కోరారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ముత్తుకూరు : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఆ స్టాండ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు అధ్యక్షతన ముత్తుకూరులోని శ్రామిక భవన్‌లో బుధవారం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య పాల్గొని మాట్లాడారు.ఆటో కార్మికులు యూనిఫామ్ ధరించి ఐడెంటిటీ కార్డు, ఆటో పేపర్స్ ఫోర్స్ ఉంచుకోవాలి, ప్రయాణికులతో గౌరవంగా మెలగాలని సూచించారు. అదేవిధంగా స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దష్టికి తీసుకుని వస్తే తక్షణ పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. అనంతరం ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేంతవరకు సంఘం పోరాడుతుందన్నారు. ఆటో కార్మికులు ఐక్యంగా ఉండాలని, ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆటో యూనియన్ కమిటీ సభ్యులు వెంకయ్య, రామయ్య, నాగరాజు, జావీదు, నాగార్జున, సాయి, విజయ్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి

ప్రజాశక్తి-కందుకూరు : ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులు, వివిధ దశలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు త్వరత గతిన ఇళ్లను పూర్తిచేయాలని కందుకూరు మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం దివి వారిపాలెంలోని జగనన్న లేఔట్‌లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు, వివిధ దశలో ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐదు లేవుట్ లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని చెప్పారు. మున్సిపల్ డి.ఇ శ్రీరామ్ మూర్తి, గహ నిర్మాణ శాఖ డిఇ సిహెచ్ శ్రీనివాసులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, ఎమినిటీస్ సెక్రటరీస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ ధర్నా

నెల్లూరు : నెల్లూరు 2 డిపో మేనేజర్ డ్రైవర్లను బలవంతంగా టీమ్ మిషన్ తీసుకుని వెళ్లాలని ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌డబ్ల్యుఎఫ్ నెల్లూరు 2 డిపో కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజర్ తన మొండివైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లను మానసిక వత్తిడికి గురిచేయడం దారుణమన్నారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షులు నంద్యాల రాజశేఖర్, జిల్లా కార్యదర్శి. కిష్టయ్య , డిపో కార్యదర్శి కె. చంద్రయ్య, ఏసిఎస్ రెడ్డి, జిఎస్ వాసులు,భారతి కార్మికులు పాల్గొన్నారు.

'యువగళం' పాదయాత్రలో రాజేష్

ప్రజాశక్తి-కందుకూరు : యువగళం పాదయాత్రలో టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ బుధవారం పాల్గొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం లో జరుగుతున్న యువగళం పాదయాత్రలో పాల్గొని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు కి సంఘీభావం తెలిపారు.

పరిశ్రమల అవసరాలకు నీటి సరఫరా

ప్రజాశక్తి-నెల్లూరు : కృష్ణపట్నం పోర్టు అదాని గ్రూపు, ఇతర పరిశ్రమల అవసరాలకు నగర పాలక సంస్థ నుంచి మిగులు మంచినీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. ముత్తుకూరులోని కష్ణపట్నం పోర్టు అదానీ గ్రూపు, ఇతర ఆయిల్ పరిశ్రమల ప్రతినిధులు, పబ్లిక్ హెల్త్ అధికారులు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశాన్ని కమిషనర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు.నగర పాలక సంస్థ ఎస్.ఈ సంపత్ కుమార్, ఈ.ఈ సంజయ్, డి.ఈలు, పబ్లిక్ హెల్త్ ఈ.ఈలు, డి.ఈలు, ఏ.ఈలు, కష్ణపట్నం పోర్టు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రణాళికలు

ప్రజాశక్తి-నెల్లూరు : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో మెరుగైన పారిశుధ్య నిర్వహణ పనులు కు సంబంధించిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సదరు అంశముల పై నగర పాలక సంస్థ తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై కమిషనర్ కార్యాలయంలో ఇరిగేషన్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో బుధ వారం సమీక్షించారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, హెల్త్ ఆఫీసర్ ,ఇంజనీరింగ్ అధికారులు, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : జగనన్న సురక్ష కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి, ముందుగా నిర్వహించిన సర్వే ప్రకారం లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లను అందించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, డిఆర్వో వెంకటనారాయణమ్మ, డిపిఒ సుస్మిత, జెడ్‌పి సిఇఒ చిరంజీవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : అర్హులందరికీ లబ్ది చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పోట్లపూడి, వెంకన్నపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్ర మాలు జరిగాయి. జగనన్న సచివాలయాల కమిటీ ఇన్‌ఛార్జి తలమంచి సురేంద్ర బాబు అధ్యక్షతన, ఎంఎల్‌ఓ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాలలో సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో రేషన్ కార్డులు, పింఛన్ల కోసమే ఉద్యమాలు జరిగేవన్నారు. అలాంటి వాటికి అవకాశం లేకుండా ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలనే సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష తీసుకొచ్చినట్లు తెలిపారు. వైసిపి నాయకులు గంగాధర్ రెడ్డి, వాలంటీర్లు, గహ సారదులు, కన్వీనర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొండారెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - లింగసముద్రం : మొగిలిచర్లలో దత్తాత్రేయస్వామి దేవస్థానంలో దేవాదాయ శాఖ ఉద్యోగిగా పనిచేస్తూ ఇఒగా ఉద్యోగోన్నతి పొందిన కొండారెడ్డి కొండపి మండలం జాళ్లపాలెం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం ఇఒగా నియమించపడ్డారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామి దేవాలయంలో బుధవారం కొండారెడ్డిని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, జయలక్ష్మి దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేవాదాయ శాఖలో 24 ఏళ్లు పనిచేసి విధినిర్వహణలో మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నారన్నారు. పని పట్ల అంకిత భావంతో పనిచేసి పదోన్నతితో బదిలీ కావడం అభినందనీయమన్నారు. దత్తాత్రేయ స్వామి దేవాలయంలో కొండారెడ్డి చేసిన సేవలు ఎప్పటికి మంచిపోలేమ న్నారు.కొండారెడ్డి మాట్లాడుతూ తాను 24 ఏళ్లు ఒకే చోట పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న ఆనందం ఒకవైపు,దత్తాత్రేయ స్వామి దేవాలయం నుండి వెళ్తున్నందుకు కొంత బాధ ఉందన్నారు. ఇంత వరకు తనకు సహ కరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయం అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్త దంపతులు

రూ. 15వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని పోకూరుకు చెందిన పెయ్యల చిరంజీవి ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. వారి కుటుంబాన్ని కందుకూరు నియోజకవర్గ టిడపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. అనంతరం రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. మాజీ ఏఎంసి చైర్మన్ గట్టమనేని చెంచురామయ్య, నాయకులు గట్టమనేని లక్ష్మీనరశింహం, దొండిమద్దెల నాగభూషణం, లింగాబత్తిన మాల్యాద్రి, గురజాల బెంజిమెన్, దార్ల సుబ్బారావు, బద్దిపూడి శిఖామణి, పర్రె రామారావు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కందుకూరు : ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు నాయకులు కోరారు. బుధవారం సుదరయ్య భవన్‌లో ప్రచార గోడ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడు తూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని కోరుతూ జులై నెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరుగుతున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు.కార్యక్రమంలో కందుకూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు కె రాజేశ్వరి, ఎస్‌కె రంతునిసా, యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్‌ఏ గౌస్, కమిటీ సభ్యులు సిహెచ్ ఉమామహేశ్వరి, కే మల్లేశ్వరి, శ్రీ లక్ష్మి కే సుభాషిని, పి లలితా, లక్ష్మి పాల్గొన్నారు.

వైద్య సేవలపై సమీక్ష

నెల్లూరు : పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, వైద్యాధికారులందరూ అంకితభావంతో పనిచేసి క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చిందని, వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు.

పది స్థానాల్లో వైసిపి గెలుపు ఖాయం

సమన్వయకర్త పరిచయ కార్యక్రమ సభలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉదయగిరి

జిల్లాలో 10 నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థుల గెలుపు ఖాయమని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎవరైతే ఈ ప్రాంతానికి సమర్థవంతంగా సేవలందించే విధంగా అందరి ఆలోచనలు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి కోరిక మేరకు ముఖ్యమంత్రి కసరత్తు చేసి సమన్వయకర్తగా రాజగోపాల్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర నలుమూలలోనైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నవరత్నాలు తలమానికగా మిగిలాయన్నారు. రూ.2750 పెన్షన్ తీసుకున్న రాష్ట్రం భారతదేశంలో ఏదైనా ఉందంటే అది ఒక ఆంధ్ర రాష్ట్రమే అని తెలియజేశారు. అంతేకాకుండా అన్ని కులాలకు సమయుక్తంగా ఆర్థికసాయం అందజేస్తున్నారన్నారు. వృద్ధులకు వలంటీర్ ఒకటో తేదీ తెల్లవారక ముందే

రాజగోపాల్‌రెడ్డిని పరిచయం చేస్తున్న మంత్రి కాకాణి

నగదు అందజేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. గతంలో పెన్షన్ ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సులు తప్పనిసరి అని, ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే ప్రతి ప్రభుత్వ పథకాలు నేరుగా ఖాతాలోకి జమవుతాయన్నారు. 2024లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. టిడిపి భూస్థాపితం చేసేందుకు దుష్టచతుష్టయం పూనుకున్నాయని, అందులోని నాయకులే టిడిపిని నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయం గురించి పవన్, లోకేష్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని, పది పంటలలో ఐదు పంటలు పేర్లు చెప్పలేని వీళ్లు వ్యవసాయ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పాదయాత్ర అంటే సమస్యలు పరిష్కరించేందుకు తానున్నానని ధైర్యం చెప్పడమనీ, లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజల సమస్యలను పక్కదారి పట్టించేలా లోకేష్ పాదయాత్ర చేయడం హాస్యాస పదమన్నారు. అనంతరం మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పరిస్థితిలో వీడనాడి ప్రస్తుతం మేకపాటి రాజగోపాల్ రెడ్డికి అందరూ సహకరించాలని కోరారు. గందరగోళ పరిస్థితులు పునరావృతం కాకుండా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో తాగు, సాగునీరు, విద్య అందించడమే తమ లక్ష్యంగా పనిచేస్తామని ఆయన మాటిచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి మేరుగా మురళీధరన్, ఆత్మకూరు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, యువ నాయకులు షర్ఫుద్దీన్, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వేగేట్ పనులను ప్రారంభించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట



మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి చల్ల నరహరి

బిట్రగుంట రైల్వే స్టేషన్ పరిధిలోని బోగోలు బజార్ సెంటర్లో ఉన్న 144 రైల్వే క్రాసింగ్ గేటు బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలని మండల సిఐటియు కార్యదర్శి చల్ల నరహరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 16 పంచాయతీల ప్రజలు రైల్వే గేటున ప్రయాణం సాగిస్తుంటారని తెలిపారు. గేటుకు పడమర వైపున ఉన్న గ్రామాలలోని ప్రజలకు ఎమర్జెన్సీ సేవలకు బోగోలు రైల్వే గేటు దాటి తూర్పు వైపు రావాల్సి ఉండగా సుమారు 20 నిమిషాలకుపైగా రైల్వే గేటు వేసి ఉండడంతో ప్రజలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. అంబులెన్స్ ద్వారా పేషంట్లను తీసుకొని వెళ్లడానికి రైల్వే గేట్ చాలా ఇబ్బందిగా మారుతుందన్నారు. అత్యవసరంగా అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న సమయంలో రైల్వే గేట్ మూసి వేయడంతో ప్రాణాలు కూడా పోయిన సంఘటనలు చాలానే ఉన్నాయన్నారు. 2013-14వ సంవత్సరంలో బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం రైల్వే శాఖ రూ.43 కోట్ల నిధులు విడుదలయినప్పటికీ రైల్వే ఉన్నత అధికారులు చొరవ చూపటం లేదని తెలిపారు. ఇకనైనా ప్రజల ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు వెంటనే బ్రిడ్జి పనులను ప్రారంభించాలని బిట్రగుంట ప్రజలు కోరుతున్నారన్నారు.

9న కావలికి మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి-కావలి : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ 9వ తేదీన కావలికి వస్తున్నట్లు ఎంఎస్‌పి కావలి గోలిపాతల వెంకటేశ్వర్లు, ఎంఎస్‌పి కావలి నియోజకవర్గ కన్వీనర్ అక్కలగుంట ఏసురత్నం, ఎంఎస్‌పి జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి తెలిపారు. బుధవారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణను చేపట్టాలని గత 29 సంవత్సరాలుగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పోరాటం చేస్తుంటే ప్రతిపక్ష మేనిఫెస్టోలో పెట్టడమే కానీ అమలు చేసింది లేదన్నారు. ఈసారి తమ హక్కులు సాధించుకొనేందుకు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో "చలో హైదరాబాద్" సన్నాహక సభను తలపెట్టినట్లు తెలిపారు. ఈ సభకు మద్దతుగా కావలి పట్టణం ముసునూరులోని మాతమ్మ గుడి వద్ద 9వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు సన్నాహక సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ వస్తున్నారని తెలిపారు. కావున కావలి ప్రాంత నాయకులు, దళిత సంఘాల నేతలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు కొపిజేటి రామ్, మోహన్, బోయిన మనోహర్, కత్తి శివయ్య, మంద మల్లి, చేవూరు కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని పుల్లాయపల్లి గ్రామపంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని సర్పంచ్ కల్లూరి శ్యామలాదేవి కస్తూరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె గ్రామంలో పర్యటించి సిసి డ్రైన్లు, సిమెంట్ రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరిముల్లా, తేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్ పాల్గొన్నారు.

హెచ్ఎంగా అనంతలక్ష్మి బాధ్యతలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా అనంతలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న శేషాద్రి నాయుడు బదిలీ అయ్యి ఎంఇఒ-1గా మనుబోలుకి వెళ్లారు. ముత్తుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనంతలక్ష్మి ఉద్యోగోన్నతిపై ఆత్మకూరుకు విచ్చేశారు. అనంతరం సిబ్బంది స్వాగతం పలికారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయురాలిని స్కూల్ కమిటీ ఛైర్మన్ మల్లికార్జున, ఉపాధ్యాయులు పుల్లయ్య, తెలుగు ఉపాధ్యాయులు ప్రసాద్, గుమస్తా శేషయ్య, పిఇటి తిరుపతయ్యలు ఘనంగా సన్మానించారు.

నేడు రేబిస్ నివారణకు టీకాలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గురువారం మండలంలోని ఇందుకూరుపేట ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు, వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు వెటర్నరీ ఎడి బి.మురళీకృష్ణ తెలిపారు. కావున పెంపుడు కుక్కల యజమానులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

ప్రజాశక్తి-కావలి : జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో ఉన్న పెంపుడు జంతువులు, వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తామని కావలి పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంగేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా జంతువులు నుండి మనుషులకు సంక్రమించే భయంకరమైన జబ్బులు రాకుండా అవగాహన సదస్సు కావలి ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశం కావలి పట్టణ ప్రజలు దీనిని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 వరకు సద్వినియోగించుకోవాలి తెలిపారు.

డిబిఎస్‌లో నూతన పాలిటెక్నిక్ కోర్సు

ప్రజాశక్తి-కావలి : డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల అనుబంధంగా 2023-24 విద్యా సంవత్సరం నుండి పాలిటెక్నిక్ (డిప్లొమా) కోర్సు అందుబాటులోకి వచ్చిందని కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు తెలిపారు. గత 15 సంవత్సరాల నుండి ఇంజనీరింగ్ విద్యను అందించి విద్యార్థులకు నూరుశాతం ఉద్యోగాలు కల్పించడంలో విశేష కృషి చేసిందన్నారు. డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా 10వ తరగతి తర్వాత డిప్లొమా కోర్సులకు దూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్ళి వస్తుందని భావించినట్లు తెలిపారు. అందువల్లే ఇంజనీరింగ్ విద్యతో పాటు పాలిటెక్నిక్ విద్యను విద్యార్థులకు అందుబాటులో ఉంచడానికి ఇంజనీరింగ్ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాలను అన్ని ప్రభుత్వ అనుమతులతో ఈ విద్యా సంవత్సరం నుండి సి.ఎస్.ఇ, ఇ.సి.ఇ, ఎంఇసి, ఈ.ఈ.ఈ.(బ్రాంచ్)లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. పాలిటెక్నిక్ విద్యను కావలి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడంపై పలువురు పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ప్రారంభించిన సి.ఎస్.ఇ (ఎ.ఐ) విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిటెక్నిక్ కౌన్సిలింగ్‌లో తమ కళాశాల కోడ్ డి.ఎస్.ఐ.టి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో 16వ వార్డు పరిధిలోని బాలకృష్ణారెడ్డి నగర్ బిట్-1 అంగన్వాడీ పాఠశాలలో బుధవారం అంగన్‌వాడీ చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హ్యాపీ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్.ఘనీబాషా మాట్లాడుతూ చిన్నారులకు ప్లేట్లు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని ముసునూరుకు చెందిన నోటి.ప్రసాద్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని వారి దాతృత్వంతో చిన్నారులకు అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నోటి.ప్రసాద్ రెడ్డికి హ్యాపీసేవా సంస్థ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హ్యాపీ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్.ఘనీబాషా, ఉపాధ్యక్షులు పి.దేవరకొండ, సంస్థ సలహాదారులు చేవూరు.ప్రభువ్య, సభ్యులు షేక్. షఫీ, నెలపాటి.శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త మడిగండ్ల మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సి.హెచ్.అనిత, ఆయా డి.సుభాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

100 రోజులు 'ఉపాధి' కల్పించాలి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు కల్పించాలని సూచించారు. అదేవిధంగా కొలత ప్రకారం పనులు చేయించి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.272 వేతనం పొందే విధంగా చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పనులు కల్పించడంతో తగినన్ని పనులు ఉండేలా అంచనాలు రూపొందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిఒ శిరీష, ఇసి, టిఎలు క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : చేనేత కుటుంబాల కార్మికుల సమస్యలు గుర్తించి వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ (లేపాక్షి) బడిగించల విజయలక్ష్మి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పూరి ఆదిలక్ష్మి ముప్పూరి రమణయ్యల ఆహ్వానం మేరకు మండలంలోని జువ్వలగుంటపల్లి, హసనపురం, చౌటపేట గ్రామాలలో చేనేత కళాకారుల చేనేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేతల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఎస్‌పేటలోని చౌడేశ్వరి దేవి ప్రాంగణంలో సమావేశంలో ఛైర్పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ జులై 5వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఉదయగిరి, వెంకటగిరి, నెల్లూరు, డిసిపల్లి, నాయుడుపేట, పొదలకూరు, కావలి, సిద్ధిపురం, బుచ్చిరెడ్డిపాలెం, సంగంలో పర్యటించి చేనేత కళాకారులను నేరుగా కలుసుకొని వారి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. స్థానిక మంత్రులు, శాసనసభ్యుల సహకారంతో నెల్లూరు జిల్లా ప్రధానకేంద్రంలో నూతన లేపాక్షి ఎంపోరియం స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విహెచ్‌డిసి అధ్యక్షుడు స్టీవెన్ మేనేజర్ పి.వి రామకృష్ణ, తిరుపతి లేపాక్షి ఎంపోరియం మేనేజర్ సత్యనారాయణ, గుర్రం వేణుగోపాల్, చేనేత నాయకులు, డైరెక్టర్ మునిరెడ్డి, లేపాక్షి సిబ్బంది వీరాంజనేయులు, చేనేత నాయకులు శ్రీనివాస రావు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

'యువగళం'ను విజయవంతం చేయండి

- మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకట రామారావు

ప్రజాశక్తి-జలదంకి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర త్వరలో ఉదయగిరి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని ఈ పాదయాత్రని నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకట రామారావు కోరారు. బుధవారం మండలంలోని రామవరప్పాడు, చోడవరం గ్రామాల్లో టిడిపి నాయకులతో కలిసి పాదయాత్ర జరగనున్న రూట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలోని కొత్తపల్లి గ్రామం నుండి ఉదయగిరి నియోజకవర్గంలోని రామవరప్పాడు గ్రామంలోకి ప్రవేశించి కొండాపురం మండలం మీదగా ప్రకాశం జిల్లాకి చేరుకుంటారని తెలిపారు. ఈ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని బొల్లినేని పిలుపునిచ్చారు. అనంతరం రామవరప్పాడు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త జలదంకి నరసింహారావు ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందారు. ఆ కుటుంబానికి మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకట రామారావు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు వంటేరు జయచంద్ర రెడ్డి, మండల అధ్యక్షులు పులుగుంట మధుమోహన్ రెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు పూనూరు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మందపల్లి మాల్యాద్రి, మండల ఉపాధ్యక్షులు కంచర్ల వినోద్ నాయుడు, మాజీ ఎఎంసి డైరెక్టర్ పెంచలనాయుడు తదితరులున్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కావలిరూరల్

మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ బట్లదిన్నె గ్రామానికి జాతీయ రహదారి నుండి గ్రామంలోకి నిర్మించే సిమెంటు రోడ్డు పనులను బుధవారం ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇక్కడికి వచ్చినప్పుడు ఈ గ్రామంలో ఉండే మహిళలు ఈ రోడ్డు విషయమై తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఆ సమయంలోనే ఈ రోడ్డు పనులు పూర్తి చేస్తేనే మీ గ్రామంలోనికి మళ్లీ వస్తానని హామీనిచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నానన్నారు. అంతేకాకుండా డ్రెయినేజీకి మరో ఐదు లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎఎంసి ఛైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, జెడ్‌పిటిసి జంపాని రాఘవులు, సర్పంచ్ సురేష్ తదితరులున్నారు.

లోకేష్‌ను సత్కరించిన ఆలేఖ్య దంపతులు

ప్రజాశక్తి-కావలి

యువగళం పాద యాత్రలో భాగంగా కోవూరు నియోజక వర్గంలోని సాలు చింతలలో ఉన్న నారా లోకేష్‌ను బుధవారం కావలి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య శ్రీకాంత్ దంపతులు పట్టుశాలువా కప్పి సత్కరించారు. ఇందులో భాగంగా లోకేష్ బాబు కూడా వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ మేరకు మధ్యాహ్నం 2 గంటలకు వ్యాపారస్తులతో లోకేష్ బాబు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వ్యాపారస్తుల నుండి వాళ్ల బాధలను శ్రద్ధగా విని వారికి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. నల్లబెల్లంపై అక్రమ కేసులు, అరెస్టులు, వ్యారుస్తులు బాధలు అన్నీ విషయాలు "వినతి పత్రం" రూపంలో లోకేష్ బాబుకి అందజేశారు. కావలి నుండి అధిక సంఖ్యలో నాయకులు వెళ్లారు.

టిడిపిలో వైసిపి నేత 'నాపా' చేరిక

ప్రజాశక్తి-కొడవలూరు

మండలం లోని కమ్మపాలెం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నాపా వెంకటేశ్వర్లు నాయుడు వైసిపిని వీడి టిడిపిలోకి 20 మంది అనుచరులతో పోలంరెడ్డి దినేష్ రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు సమక్షంలో టిడిపి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాపా వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వ అధికారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును, కోవూరు నియోజకవర్గ యువ నాయకుడు పోలంరెడ్డి దినేష్ రెడ్డి ఎంఎల్‌ఎగా గెలిపించుకుంటామన్నారు.

వర్గాల బల ప్రదర్శనగా 'పరిచయ వేదిక'

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఉదయగిరిలో నిర్వహించిన సమన్వయకర్త పరిచయవేదిక కార్యక్రమం వరికుంటపాడు మండలంలోని ఇరు వర్గాల బలప్రదర్శనగా మారింది. ఉదయగిరి నియోజకవర్గంలో ప్రత్యేక విశిష్టత సంతరించుకున్న వరికుంటపాడులో రాజకీయాలు ఎప్పుడు వాడీవేడిగానే ఉంటాయి. బుధవారం సాయంత్రం జరిగిన వైసిపి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి పరిచయ కార్యక్రమంలో కూడా ఈ బల ప్రదర్శన వేదికగా కావడం విశేషం. ప్రధానంగా ఉండే రెండు గ్రూపులు తమకు తామే పోటీ అంటూ జన సమీకరణ చేశారు. మండలంలోని 24 పంచాయతీల్లో ఉన్న ప్రముఖులను ఇరువర్గాల వాళ్లను తమదైన శైలిలో రప్పించుకున్నారు. కానీ కొన్ని కీలకమైన ఊర్లలో మాత్రం రెండు వర్గాలు కాకుండా మూడు వర్గాలు ఉన్నాయి. ఈ నాయకులందరూ ఎవరికి వారే సత్తా చాటుకునే విషయంలో రాజీపడని ధోరణి అవలంభించారు. ప్రకాశం జిల్లా సరిహద్దుల్లో ఉండే ఈ

ఉదయగిరిలో నిర్వహించిన పరిచయ సభలో నాయకులు

వరికుంటపాడు మండలం రాజకీయాలకు పెట్టింది పేరు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వరికుంటపాడులో వైసిపిలో రెండు గ్రూపులలో ప్రధాన లీడర్లు తామే ముందుండాలనీ, పనులు నిర్వహించాలనీ, పావులు కదిపారు. ఉదయగిరిలో జరిగిన మేకపాటి పరిచయ వేదికను దృష్టిలో ఉంచుకొని తామెంటో నిరూపించుకునే విధంగా వాహనాలను ఏర్పాటు చేశారు. ఇటు వైసిపి మండల కన్వీనర్ బాల గురువారెడ్డి వర్గం, మరోవైపు మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ అలీ అహ్మద్ వర్గం ఎవరికి వారే తమ ప్రాభల్యాన్ని పెంచుకునే దిశలో ప్రత్యేక వాహనాలు జన సమీకరణతో ఎన్నికల వేడిని రగిలించారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

ప్రజాశక్తి-కావలి

అపరిష్కృతంగా ఉన్న పారిశుధ్య కార్మికుల సమస్యలు వెంటనే 15రోజుల్లోగా పరిష్కరించక పోతే సమ్మె చేస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం యూనియన్ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, ఎండ్లూరి ఆది నారాయణ, కె.నాగరాజు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల యు.ఎ.ఎన్. నెంబరుకు ఆధార్‌కు లింక్ చేయాలన్నారు. వారి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికులందరికీ సబ్బులు, నూనెలు, యూనిఫారం, చెప్పులు వెంటనే ఇవ్వాలన్నారు. 60 సంవత్సరాల వయస్సు పేరుతో తొలగించిన కార్మికులందరి వారసులను పనిలో పెట్టుకోవాలన్నారు. వారి ఇ.పి.ఎఫ్.ను సెటిల్‌మెంట్ చేయాలన్నారు.

మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఎ.ఐ.టి.యు.సి. నాయకులు

ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు జి.ఒ. ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. కావలి పట్టణ జనాభాకు అనుగుణంగా, విస్తీర్ణం మేరకు తగిన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ వర్కర్ల చిన్నచిన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గుంజి కిషోర్, ఎ.ప్రభావతి, వేణు, ఎ.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బ్రూసెల్లా వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-మర్రిపాడు

మర్రిపాడు, అనంతసాగరం పశువైద్య కేంద్రాలలో ఆడ దూడలకు బ్రూసెల్లా వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు బుధవారం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గురుజయంతి తెలియజేశారు. ఈ వ్యాక్సినేషన్ 4 నుండి 11 నెలలు వయస్సు ఉన్న దూడలకు ఒక్కసారి వేయడం వల్ల జీవించినంత వరకు పనిచేస్తుందని తెలిపారు. పెద్దవి అయిన తర్వాత చూడి కట్టేటప్పుడు, ఈని పాలిచ్చేటప్పుడు బ్రూసెల్లా వ్యాధిబారిన పడకుండా తప్పించుకుంటాయన్నారు. జీవితకాలం రోగ నిరోధక శక్తిని ఇస్తుందని, పశువుల పెంపకం దార్లు దగ్గరలోని పశువైద్యశాల

సిబ్బందిని కలిసి ఆడదూడలకు టీకాలు వేయించాలన్నారు. ఈ టీకాలు పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. దూడలకు కడుపులో జలగలు ఉంటే దూడ చెవికి ఉన్న కమ్మ నెంబరును ఇనాప్‌లో నమోదు చేసుకొని మందులు అందజేస్తామన్నారు. పశువుల్లో అబార్షన్ జరుగకుండా రైతులు నష్టపోకుండా ఆర్థికంగా ఎదిగేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్ఐగా ముత్యాలరావు బాధ్యతలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు ఎస్ఐగా ముత్యాలరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. మను బోలు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన ఆత్మకూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ ముత్యాలరావు మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతలు, పట్టణ ట్రాఫిక్, ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని దీనికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ముందుగా ఎస్ఐ ముత్యాలరావుకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం డిఎస్‌పి కోటారెడ్డి, ఇన్‌ఛార్జి సిఐ రవినాయక్‌లను ఎస్ఐ ముత్యాలరావు కలిసి బొకే అందజేశారు.

పొగాకు విక్రయానికి అనుమతి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని2022-23 పంట కాలానికి సంబంధించి రైతులు అధికంగా పండించిన వర్జీనియా పొగాకు పంటను రిజిస్టర్ కాని రైతుల అనధికార పొగాకును పొగాకు బోర్డులో అమ్ముకొనడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలియజేశారు. ఎటువంటి అపరాధ రుసుము చెల్లించకుండానే రైతుల వద్ద ఉన్న పొగాకును అమ్ముకోవచ్చన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం రాజా వీధిలో ఉన్న షిరిడి సాయిబాబా మందిరం ఆలయ వ్యవస్థాపకురాలు బచ్చు అమర 5వ వర్ధంతి సందర్భంగా బుధవారం పేదలకు దుప్పట్లను, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ బచ్చు అమర తనకు ఉన్న సంపదలో పేదలకు, పాఠశాలలకు, ఆలయానికి సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరికను ట్రస్ట్ సభ్యులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, పేదలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన 108 వాహనానికి పూజలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట మండలంకు కేటాయించిన నూతన 108 వాహనాన్ని ఎఎస్‌పేటలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేకంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 108 అంబులెన్స్ పైలట్స్ లక్ష్మయ్య, వేణుగోపాల్ రెడ్డి, టెక్నీషియన్ బాలకృష్ణ ఆచారి, ఖాజా రసూల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి ఎంఇఒలు షేక్ మస్తాన్ వలి, తోట శ్రీనివాసులు జి అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలను ఉపాధ్యాయులను అభినందించారు. బుధవారం మండల పరిధిలోని మండల పరిషత్ జి అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలను వారు తనిఖీ చేశారు. జగనన్న మనబడి నాడు-నేడు ఫేస్-1లో జరిగిన పాఠశాల అభివృద్ధిని, పాఠశాల లోపల గ్రీనరీ, మొక్కల పెంపకం బాగుందని ప్రధానోపాధ్యాయులు ఎల్.బాబు, ఉపాధ్యాయులు ఎం.ఫణికుమార్‌ను అభినందించారు. అనంతరం విద్యాశాఖ అధికారులు పాఠశాల విద్యార్థుల తెలుగు, గణిత, ఆంగ్లంలో విద్యార్థుల పఠన అభ్యసన సామర్థ్యాలను నైపుణ్యాలను పరిశీలిస్తూ, తెలుగులో విద్యార్థులు గేయాలను పద్యాలను రాయుక్తంగా పాడే విధంగా చూడాలన్నారు. గణితంలోనే చతుర్విధ ప్రక్రియలలో

పాఠశాలలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒలు

బాగాహారం, గుణించడంలో విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందే విధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల, మధ్యాహ్న భోజన కార్మికులు ఆయాల హాజరు పట్టీలను, మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించారు. పాఠ్య ప్రణాళికలు తయారు చేసుకుని బోధనోపకరణాలతో బోధించాలని సూచించారు.

వెలగని విద్యుత్ దీపాలు

- చీకట్లో డివైడర్‌ను ఢీ కొడుతున్న వాహనాలు
- ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని అధికారులు

ప్రజాశక్తి-వరికుంటపాడు

నిత్యం వాహనాలతో బిజీగా ఉండే వరికుంటపాడు జాతీయ రహదారి 565 చీకటిమయంలో మగ్గుతుంది. వరికుంటపాడు జాతీయ రహదారి హైవేపై మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ లైట్ వెలగడం లేదు. హైవేపై ఉన్న సెంట్రల్ లైటింగ్ వెలగక పోవడం నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులు ఇప్పటికైనా తమ పనితీరు మార్చుకోవాలని పలువురు కోరుతున్నారు. అభివృద్ధి పనులు పేరుతో అధికారులు వరికుంటపాడులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అవి వెలగకుండా మూడునాళ్ల ముచ్చటగానే ఉన్నాయి. మూడేళ్ల నుంచి లైట్లు వెలగకపోయినా పట్టించుకున్న



గత కొన్ని రోజులుగా వెలగని వీధి దీపాలు

నాథుడే కరువయ్యారు. దాంతో రాత్రి సమయాల్లో వరికుంటపాడు రహదారి పూర్తిగా కారు చీకట్లు కమ్ముకున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పక్కన ఉన్న డివైడర్ను ఢీకొన్న ఘటనలో ఉన్నాయి. ఇప్పటికే హైవేలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అధికారులు స్పందించి హైవేపై ఉన్న లైటులను వెలిగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రయాణికులు వాహనదారులు వాపోతున్నారు.

IN THE COURT OF THE ADDITIONAL DISTRICT JUDGE, IV AT PONNERI
M.C.O.P. NO.161 of 2022

Melika Mohan and another .....Petitioners

Vs

1. Thamisetty Sreenu
2. Cholamandalam, M.S Gen., Insurance Company Ltd., ...Respondents

To
Thamisetty Sreenu,
S/O Mr. Ramanaiah,
Nandhavaram, Maripadu,
Nellore District, A.P. 524 307

NOTICE

It is notified that the above named petition had filed the above Petitioner claiming compensation for the death of her husband in a road accident on 12.02.2022. The same is posted for your appearance on 26.07.2023. You are hereby called upon to appear before the above said court on the said day at 10.30 a.m. and submit your objections either in person or by a duly instructed advocate, failing which the case will be decided in your absence.

S. Balaji,
Advocate, Ponneri

CHANGE OF SURNAME

I, MANDIPATI SASIREETH REDDY (Old Name), S/o. MANDHIPATI CHANDRASEKHAR REDDY Residing at Kakupalli, Nellore Rural, SPSR Nellore District, Andhra Pradesh hereby declare that I have changed my surname as MANDHIPATI SASIREETH REDDY (New Name) Hereafter call all purpose in future

CHANGE OF SURNAME

I, MANDIPATI HANITH REDDY (Old Name), S/o. MANDHIPATI CHANDRASEKHAR REDDY Residing at Kakupalli, Nellore Rural, SPSR Nellore District, Andhra Pradesh hereby declare that I have changed my surname as MANDHIPATI HANITH REDDY (New Name) Hereafter call all purpose in future